ఇప్పటికే రాలిన మట్టిపూలు **466**

## మరో కౌలు రైతు ఆత్మహత్య

- దిగుబడులు రాక.. అప్పుల మోయలేక
- నాగర్‌కర్నూల్ జిల్లా దేవుని తిర్మలాపూర్‌లో విషాదం



శ్రీనివాసులు (ఫైల్)

పెద్దకొత్తపల్లి, మార్చి 30 : మామిడి దిగుబడి రాకపోవడం.. అప్పులు తీర్చే మార్గం లేక ఓ కౌలు రైతు చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దకొత్తపల్లి మండలం దేవునితిర్మాలపూర్‌కు చెందిన కోనమోని శ్రీనివాసులు (55) కల్వకుర్తి మండలం వేపూరులో రూ.3.50 లక్షలు నగదు చెల్లించి 20 ఎకరాల మామిడి తోటను కౌలుకు తీసుకున్నాడు. మామిడి తోటపై రూ.ఐదారు లక్షల వరకు అప్పు తెచ్చి పెట్టుబడి పెట్టినా తోటకు పూత రాలేదు. దీంతో రూ.13 లక్షల దాక అప్పులు మీద పడ్డాయి. అప్పులు ఎలా తీర్చాలో తెలియక మదనపడ్డాడు. శుక్రవారం తోటకు వెళ్లిన శ్రీనివాసులు ఇంటికి రాకపోగా.. ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు ఆదివారం పక్క తోటను కౌలు తీసుకున్న రైతుకు ఫోన్ చేసి విషయం చెప్పారు. అతను తోటలోకి వెళ్లి చూడగా శ్రీనివాసులు మామిడి చెట్టుకు తన పంచెతోనే ఉరేసుకుని విగతజీవిగా వేలాడుతూ కన్పించాడు. వెంటనే సదరు రైతు శ్రీనివాసులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు వెంటనే అక్కడికి చేరుకున్నారు. కౌలు రైతు మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.



పుల్కల్ మండలం బస్వాపూర్‌లో సాగునీరు లేక ఎండిపోయిన ఉల్లిపంట



పుల్కల్ మండలం కోడూరులో బోరు మోటర్ మరమ్మతు చేయించుకుంటున్న రైతులు

# పంటలకు నీళ్లులేక రైతన్న కంటతడి

- ఓ వైపు వట్టిపోయిన బోర్లు మరోవైపు కరెంటు కోతలు
- సాగునీరు లేక ఎండుతున్న వరి
- సింగూరు దిగువన నీరులేక ఎండుతున్న పంటలు
- ప్రాజెక్టులో నీళ్లున్నా సాగుకు అందని దైన్యం
- 'నమస్తే' ఫీల్డ్‌విజిట్‌లో గోడువెళ్లబోసుకున్న రైతులు

సంగారెడ్డి, మార్చి 30 (నమస్తే తెలంగాణ): సాగునీరు లేక రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. పచ్చని పంట కండ్లముందే ఎండుతుంటే గుండెలు బాదుకుంటున్నారు. ప్రాజెక్టుల్లో నిండుగా నీళ్లున్నా పొలాలకు నీళ్ల పారటంలేదు. భూగర్భ జలాలు అడుగంటడంతో బోరుబావులు నీళ్లుపోయక పంటలు దెబ్బతింటున్నాయి. కరెంటు కోతలు లోవోల్టేజీతో బోరుమోటర్లు కాలి రైతుల జేబులకు చిల్లులు పడుతున్న విషయాలు సంగారెడ్డి జిల్లాలో 'నమస్తే తెలంగాణ' చేపట్టిన ఫీల్డ్ విజిట్‌లో వెలుగుచూశాయి. యాసంగి సీజన్‌లో సంగారెడ్డి జిల్లాలో 1.15 లక్షల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేశారు. సింగూరు, నల్లవాగు ప్రాజెక్టుల కింద వరి, జొన్న, కూరగాయ పంటలను సాగుచేశారు. సంగారెడ్డి, అందోల్, నారాయణఖేడ్ నియోజకవర్గాల్లోని రైతులు బోరుబావుల కింద అత్యధికంగా వరి, నీళ్ల జొన్న సాగు చేశారు. 50 వేల ఎకరాల్లో రైతులు వరి వేశారు. సింగూరు ప్రాజెక్టు కింద నీటిపారుదల శాఖ క్రాప్‌హాలిడే ప్రకటించినప్పటికీ రైతులు 16 వేల ఎకరాలకుపైగా విస్తీర్ణంలో వరి సాగు చేశారు. నల్లవాగు ప్రాజెక్టు, చెరువులు, బోరుబావుల కింద 34 వేల ఎకరాల్లో వరి వేశారు. ఒక్క నల్లవాగు కిందనే 600 ఎకరాలకు సాగునీరు అందక వరి, జొన్న ఎండిపోయే ప్రమాదం ఉన్నది.

### అనధికారిక కరెంట్ కోతలు

పుల్కల్, చౌటకూరు మండలాల్లో అనధికారికంగా కరెంటు కోతలు అమలు చేస్తున్నట్టు రైతులు తెలిపారు. ఉదయం 6 నుంచి ఉదయం 11 గంటల వరకు కరెంటు సరఫరా కావటంలేదని, ఆ తర్వాత కరెంటు సరఫరా అవుతున్నా మధ్యలో కొన్ని గంటలపాటు కరెంట్ ఉండటంలేదని వారు పేర్కొంటున్నారు. లోవోల్టేజీ సమస్య కారణంగా ట్రాన్స్‌ఫార్మర్లు, బోరుమోటర్లు కాలిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టడం, కరెంటు కోతలు, లోవోల్టేజీ సమస్యతో పుల్కల్ మండలంలోని పుల్కల్, బస్వాపూర్, ఇసోజిపేట, గొంగ్లూరు, గంగోజిపేట, చౌటకూరు మండలంలోని చౌటకూరు, బొమ్మారెడ్డిగూడెం, ఉప్పరిగూడెం, బద్రిగూడెం, కోర్పోల్, సుల్తాన్‌పూర్‌లో సాగునీరు అందక వరి ఎండిపోతున్నది. దీంతో సింగూరు ప్రాజెక్టు నుంచి నీరు ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

### నీళ్లు లేక ఆగమవుతున్నం..



నీళ్లు లేక కండ్లముందే వరి ఎండిపోతుంటే కన్నీళ్లొస్తున్నాయి. మరో 20 రోజులు నీళ్లు లేకపోతే పంట పూర్తిగా ఎండిపోతుంది. నాకు ఉన్న 1.50 ఎకరాల్లో అప్పుచేసి మరీ వరి వేసిన. బోరు బావి కింద వరి కలిసివస్తుందని అనుకున్నా. ఇప్పుడు బోరు నీళ్లు పోయటంలేదు. నీళ్లు లేక పంటపూర్తిగా ఎండిపోతుంది. ప్రభుత్వం పెద్ద మనస్సు చేసుకుని సింగూరు నుంచి కాల్వల ద్వారా నీళ్లు ఇచ్చి ఆదుకోవాలి.

– కుమ్మరి పెంటయ్య రైతు, పుల్కల్

### కేసీఆర్ పాలనలో నీళ్లు పుష్కలం

కేసీఆర్ పాలనలో రైతులకు సాగునీళ్లు, కరెంటు ఫుల్‌గా ఉండేవి. ఇప్పుడు సాగునీళ్లు లేవు. కరెంటు కూడా సరిగ్గా ఉంటలేదు. కోతలు, లోవోల్టేజీతో ఇబ్బంది పడుతున్నాం. లోవోల్టేజీతో మూడు రోజుల క్రితం నా బోరు మోటర్ కాలిపోయింది. బోరుబావిలో నుంచి మోటర్ బయటకు తీసేందుకు రూ.2వేలు, మరమ్మతుకు రూ.6వేలు ఖర్చు అవుతుంది.

– ప్రభాకర్, రైతు, కోడూరు

### నీళ్లు లేక మూడు ఎకరాలు ఎండింది

మూడు ఎకరాలు కౌలుకు తీసుకుని పంట సాగు చేస్తే నిరుడు అతివృష్టితో నష్టం జరిగిందని ఈ సారి భూగర్భ జలాలు అడుగంటి పొలం ఎండిపోయిందని మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం సీతారాం తండాకు చెందిన రైతు గుగులోత్ బాలు ఆవేదన వ్యక్తంచేశారు. కౌలుకు తీసుకున్న భూమిలో రెండు బావుల ఆధారంగా వ్యవసాయం చేస్తున్నట్టు తెలిపాడు. రూ. 40 వేలు అప్పుచేసి వరి పండిస్తున్నట్టు చెప్పాడు. గతంలో ఆకేరు వాగు వరదలతో మట్టి మేటలు వేశాయని, బావులు వరద నీటితో నిండిపోవడంతో పొలాల్లో పేరుకు పోయిన మట్టిని తొలగించడానికి రూ.లక్ష ఖర్చు చేసినట్టు తెలిపాడు. ఇప్పుడేమో రెండు బావుల్లో నీరు అడుగంటడంతో నీరందక మూడు ఎకరాల వరి ఎండిపోయిందని ఆవేదన చెందాడు. – మరిపెడ



## బోర్లు పోస్తలేవు.. పంటలు పండుతలేవు

- సాగుకు ట్యాంకర్ నీరే దిక్కు
- పొట్టకొచ్చిన పంటలను కాపాడుకునేందుకు అన్నదాతల విశ్వప్రయత్నాలు
- రంగారెడ్డి జిల్లాలో సాగునీటికి తప్పని తిప్పలు

రంగారెడ్డి, నమస్తే తెలంగాణ : రంగారెడ్డి జిల్లాలో సాగునీటి కోసం అన్నదాతలు అరిగోస పడుతున్నారు. మరో 15 రోజుల్లో పంటలు చేతికొస్తాయనుకునే సమయంలో బోర్లు ఎండిపోవడంతో పంట పొలాలు ఎక్కడికక్కడ ఎండిపోతున్నాయి. పెట్టుబడులు పెట్టి సాగుచేసిన పంటలు కండ్లముందే ఎండిపోతుంటే తట్టుకోలేని రైతులు ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసి పొలాలను పారిస్తున్నారు. ఒక్కో రైతు రోజుకు నాలుగు నుంచి ఐదు ట్యాంకర్లను కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొన్నది. సాగునీటి కోసం రైతుల రోజువారీగా రూ.2 వేలు నుంచి రూ.3 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. కాగా, మరికొంతమంది రైతులు కొత్తగా బోర్లు వేస్తున్నా నీళ్లు రాక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఈ యాసంగిలో జిల్లా వ్యాప్తంగా 93 వేల ఎకరాల్లో వరి వేయగా.. ఇప్పటికే సుమారు 20 వేల ఎకరాల వరకు ఎండిపోయిందని రైతులు వాపోతున్నారు. పదిహేను రోజుల్లో మరింత ఎండిపోయే ప్రమాదం ఉన్నదని, పదిహేను రోజులు దాటితే తప్ప తాము బయటపడే అవకాశం లేదని రైతులు చెప్తున్నారు.

### నీరు పోసినా పారడంలేదు

నేను రెండెకరాలు కౌలుకు తీసుకుని ఆకు కూరలు వేసిన. పదిహేను రోజుల కిందటి వరకు బోరులో నీళ్లు ఉండటంతో పొలాన్ని అచ్చుకట్టి పీకెలు చేసిన. పీకెలలో పాలకూర, ఇతర ఆకు కూరలు వేసిన. రెండ్రోజుల నుంచి బోరుమొత్తం ఎండిపోయింది. నీరు రావడంలేదు. ఆగి ఆగి కొద్దిపాటి నీరుపోస్తున్నది. రోజంతా పైపులు పట్టుకుని కూర్చున్నా.. పీకె కూడా పారడంలేదు.

– శంకరయ్య, రైతు, నోముల గ్రామం, మంచాల మండలం



నోముల గ్రామంలో పైపుల ద్వారా నీటిని పారిస్తున్న రైతు శంకరయ్య దంపతులు

## మక్కల కొనుగోళ్లకు చర్యలు

- మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కేంద్రాలు
- 12 లక్షల టన్నులు కొనుగోలు

హైదరాబాద్, మార్చి 30 (నమస్తే తెలంగాణ): రైతుల నుంచి మద్దతు ధరకు మక్కలు కొనుగోలు చేయాలని వ్యవసాయ శాఖ నిర్ణయించింది. ఈ మేరకు మార్క్‌ఫెడ్‌ను ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఒకటి రెండు రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా మక్కల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు మార్క్‌ఫెడ్ అధికారులు చర్యలు చేపట్టారు. మొత్తం 320 కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. పంట ముందుగా చేతికొచ్చే జిల్లాల్లో తొలుత ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. యాసంగిలో రికార్డు స్థాయిలో 8.50 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగు కాగా, మొత్తం 23 లక్షల టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందులో తొలిదశలో 12 లక్షల టన్నుల కొనుగోలుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అవసరమైతే మరింత కొనుగోలుకు సిద్ధంగా ఉన్నట్టు అధికారులు తెలిపారు.

## మక్క కంకులు తిని యువరైతు మృతి

**భద్రాద్రి జిల్లా వినోభానగర్‌లో విషాదం**



కృష్ణ (ఫైల్)

జూలూరుపాడు, మార్చి 30: మక్కజొన్న కంకులు తిని అస్వస్థతకు గురై యువరైతు మృతిచెందాడు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల పరిధిలోని వినోభానగర్‌లో ఆదివారం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వినోభానగర్‌కు చెందిన జరుపల కృష్ణ (30) తన ఐదెకరాల భూమిలో ఓ కంపెనీకి చెందిన మేల్, ఫిమేల్ మక్కజొన్న సాగు చేశాడు. మక్కజొన్న కంకులు విరిసేందుకు సిద్ధంగా ఉండటంతో వారంరోజులుగా పొలం వద్ద కాపలా కోసం వెళ్తున్నాడు. ఆ సమయంలో చేను వద్ద రోజూ కంకులు కాల్చుకొని తింటున్నాడు. దీంతో రెండ్రోజులుగా కాళ్లు లాగడం ఒళ్లంతా నీరసించిపోవడం లాంటి సంకేతాలు కనిపిస్తున్నాయని కుటుంబ సభ్యులకు తెలిపాడు. మేల్, ఫిమేల్ మక్కజొన్న కంకులు తినడం వల్లే ఇలా జరుగుతుందని తెలియక వాటిని తినడం ఆపలేదు. దీంతో ఆదివారం ఉదయం తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు.



ఆయిల్‌పాం ఫ్యాక్టరీ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్న ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు

## ఆయిల్‌పాం ఫ్యాక్టరీ నిర్మాణాన్ని ఆపండి

- సంకిరెడ్డిపల్లి తండా శివారు గ్రామస్థుల ధర్నా
- ఎమ్మెల్యే జీఎంఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు
- ధర్నాలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు

కొత్తకోట, మార్చి 30 : ఆయిల్‌పాం ఫ్యాక్టరీని నిర్మించొద్దంటూ పలు గ్రామాల ప్రజలు ఆందోళనకు దిగారు. వనపర్తి జిల్లా కొత్తకోట మండల పరిధిలోని సంకిరెడ్డిపల్లి తండా శివారులోని కొటేటేన్ గుట్టపై ఆయిల్‌పాం ఫ్యాక్టరీ నిర్మాణం చేస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ భూమిలో ఆయిల్‌పాం ఫ్యాక్టరీ నిర్మాణాన్ని చేపట్టొద్దని చుట్టు పక్కల గ్రామాలకు చెందిన ప్రజలు ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవరకద్ర ఎమ్మెల్యే జీ మధుసూదన్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇక్కడ ఫ్యాక్టరీ నిర్మాణం చేపడితే సంకిరెడ్డిపల్లి గ్రామం చుట్టు పక్కల గల సంకిరెడ్డిపల్లి కొత్త ఊరు, సంకిరెడ్డిపల్లి తండా, కానాయపల్లి కొత్త ఊరు, కొత్తకోటకు చెందిన పలు కాలనీలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉన్నదన్నారు. ఈ గుట్ట నాలుగు గ్రామాల్లో ఉండే గొర్రెలు, పశువుల మేతకు ఉపయోగపడుతుందని, ఈ గుట్టను ప్రైవేటు ఐటీ కంపెనీ వారు ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకొని ఆయిల్‌పాం ఫ్యాక్టరీని ప్రారంభించడానికి సిద్ధమవుతుండటాన్ని వారు తీవ్రంగా వ్యతిరేకించారు. ధర్నాలో పాల్గొన్న వారంతా కాంగ్రెస్ కార్యకర్తలే కావడం విశేషం. ఫ్యాక్టరీని నిర్మించడానికి వీలు లేదని కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి గెలిపించుకున్నందుకు చెప్పుతో కొట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఎమ్మెల్యేను తీవ్రంగా దుయ్యబట్టారు.

## కొడుకు మరణాన్ని తట్టుకోలేక..

**మనస్తాపంతో తండ్రి మృతి**

గోపాల్‌పేట, మార్చి 30 : కొడుకు మరణాన్ని తట్టుకోలేక మనస్తాపంతో తండ్రి మృతి చెందాడు. ఈ విషాదకర ఘటన వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం బుద్ధారంలో ఆదివారం చోటుచేసుకున్నది. గ్రామస్థుల కథనం మేరకు.. బుద్ధారం గ్రామానికి చెందిన ఏశమోని ఆంజనేయులు (30) ఈనెల 20న ఆత్మహత్య చేసుకున్నాడు. కొడుకు మరణాన్ని తట్టుకోలేక కొద్దిరోజులుగా మనస్తాపానికి గురైన ఏశమోని కోదండం (60) ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. కొద్దిరోజుల వ్యవధిలోనే ఒకే ఇంట్లో తండ్రీకొడుకు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# రైతు భరోసా పడ్డదా?

మొదటిపేజీ తరువాయి...

పూర్తిగా ఎగ్గొట్టారు. ఈ సీజన్‌లో పంటల సమయంలోనే రైతుభరోసా జమ చేస్తామని చెప్పిన సర్కారు.. కోతలు మొదలైనా ఇవ్వడం లేదు. దీంతో రైతుల్లో సర్కారు హామీపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### రైతులకు రూ.4,834 కోట్ల 'భరోసా' బాకీ

యాసంగి సీజన్ రైతుభరోసా పంపిణీ ప్రారంభించి రెండు నెలలు పూర్తయింది. ఇప్పటివరకు నాలుగు ఎకరాలలోపు రైతులకు మాత్రమే ప్రభుత్వం రైతు భరోసా పైసలు జమచేసింది. మొత్తం 70 లక్షల మంది రైతులు ఉండగా, 52 లక్షల మందికే పంపిణీ చేసింది. ఇంకా 18 లక్షల మంది రైతుభరోసా కోసం ఎదురుచూస్తున్నారు. ఈ యాసంగిలో రైతుభరోసా కింద రూ.9 వేల కోట్లు పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటివరకు రూ.4,166 కోట్లు మాత్రమే రైతుల ఖాతాల్లో జమ చేసింది. మిగిలిన రైతులకు రూ.4,834 కోట్లు పంపిణీ చేయాల్సి ఉన్నది.

### పంటలు కోతకొచ్చినా.. భరోసా లేదాయే

కాంగ్రెస్ సర్కారు హయాంలో రైతులకు పెట్టుబడి సాయం పంపిణీ ప్రహసనంగా తయారైంది. కాంగ్రెస్ సర్కారు రైతుభరోసా పథకం ఉద్దేశాన్నే దెబ్బతీసిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నాట్లు వేసే సమయంలో ఇవ్వాల్సిన రైతుభరోసాను పంటలు కోతకు వచ్చినా ఇవ్వలేని పరిస్థితి నెలకొన్నది. బీఆర్‌ఎస్ హయాంలో విత్తనాలు వేసే సమయంలోనే రైతుబంధు నిధులు రైతుల ఖాతాల్లో జమ చేయడంతో విత్తనాలు, ఎరువులు, కూలీలు తదితర అవసరాలకు ఆ పైసలు ఉపయోగపడేవి. కానీ, ఇప్పుడు రైతుభరోసా ఆలస్యంగా జమ చేస్తుండటంతో మొత్తం భారం తమపైనే పడుతున్నదని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రైతుభరోసా అందకపోవడంతో అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నదని చెప్తున్నారు.

### తెలిసే తేదీ ప్రకటించారా?

మార్చి 31లోపు రైతుభరోసా పంపిణీ చేస్తామంటూ ప్రభుత్వం చేసిన ప్రకటనపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉగాది, రంజాన్ పండుగల నేపథ్యంలో బ్యాంకులకు వరుసగా మూడు రోజులపాటు సెలవులు ఉన్నాయి. దీంతో రైతుల ఖాతాల్లో రైతుభరోసా వేయడం సాధ్యంకాదు. సోమవారం బ్యాంకులకు సెలవు దినం అయినందున రైతుభరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమచేయడం సాధ్యమయ్యే పనికాదు. దీంతో బ్యాంకుల సెలవులను సాకుగా చూపే అవకాశం ఉన్నది. దీంతో ప్రభుత్వం తప్పించుకునే ప్లాన్‌లో భాగంగానే మార్చి 31 గడువు పెట్టిందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## త్వరలోనే వేస్తం: ముఖ్యమంత్రి రేవంత్

- మార్చి 31లోపు 90% పూర్తి చేస్తం
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల
- సీఎం, మంత్రిది తలో మాట
- నాట్లు పోయి.. కోతలు మొదలైనా అందని సాయం

హైదరాబాద్, మార్చి 30 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సర్కారు రైతులను మరోసారి ధోకా చేసింది. రైతుభరోసా పెట్టుబడి సాయం విషయంలో మళ్లీ మాట తప్పింది. జనవరి 26న రైతుభరోసా పథకాన్ని ప్రారంభినప్పుడు మార్చి 31లోపు రైతులందరికీ సాయం అందిస్తామని చెప్పిన మాటను నిలబెట్టుకోవడంలో సీఎం రేవంత్‌రెడ్డి విఫలమయ్యారు. ఇచ్చిన గడువులోపు పెట్టుబడి సాయం అందించలేకపోయిన సర్కారు వాయిదాల పర్వాన్ని కొనసాగిస్తున్నది. ఇప్పుడు తాజాగా రైతుభరోసా సొమ్ము 'తొందరలో' అందరికీ వేస్తామని కొత్త రాగం అందుకున్నారు. హుజూర్‌నగర్‌లో జరిగిన సభలో మాట్లాడుతూ.. ఇప్పటికే రైతులకు రూ.5 వేల కోట్లు రైతుభరోసా ఇచ్చామని, తొందరలో మిగిలిన రూ.4 వేల కోట్లు అందిస్తామని చెప్పారు. రైతుభరోసాను రూ.12 వేలకు పెంచామని, ఏటా రూ.20 వేల కోట్ల చొప్పున రైతుభరోసా అందిస్తామని గప్పాలు కొట్టారు. ఈ విధంగా రైతుభరోసాను వాయిదా మీద వాయిదా వేస్తున్నారు. మరోవైపు వ్యవసాయం శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇటీవల విలేకరులతో మాట్లాడుతూ... ఇచ్చిన మాట ప్రకారం మార్చి 31వ తేదీ రాత్రిలోపు 90శాతం రైతుభరోసా అందిస్తామని చెప్పారు. ఓవైపు సీఎం తొందర్లో వేస్తామని మరో వాయిదా వేయగా.. మంత్రి మాత్రం మార్చి 31లోపు 90 శాతం పూర్తిచేస్తామని ప్రకటించడం విడ్డూరం. ఒకరికొకరు పొంతన లేకుండా సీఎం, మంత్రి ఇలా తలోక మాట మాట్లాడటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### కోతలు మొదలైనా...

నాట్లు వేయకముందే సాయం అందిస్తే రైతులకు ఆదెరువుగా ఉంటుంది. బీఆర్‌ఎస్ సర్కార్ ఇలాగే నాట్లు వేయకముందే రైతుల ఖాతాల్లో సొమ్ము జమచేసి పెట్టుబడులకు ఆసరాగా నిలిచింది. కానీ, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మాత్రం నాట్లు వేసేటప్పుడు అందించాల్సిన పెట్టుబడి సాయాన్ని కోతలు మొదలైనా ఇవ్వడం లేదు.

## పత్తి రైతులపై భారీగా విత్తన భారం

- ఒక్కో ప్యాకెట్‌పై రూ. 37 పెంచిన కేంద్రం
- ఈ సీజన్‌లో రైతులపై రూ.74కోట్ల ఆర్థిక భారం

హైదరాబాద్, మార్చి 30(నమస్తే తెలంగాణ): మూలిగే నక్కపై తాటికాయపడ్డ చందంగా తయారైంది పత్తి రైతుల పరిస్థితి. ఇప్పటికే పత్తికి ఆశించిన ధరలేక కుదేలైతున్న రైతులపై కేంద్ర ప్రభుత్వం బీటీ–2 పత్తి విత్తన ప్యాకెట్ల ధరను పెంచుతూ నిర్ణయం తీసుకున్నది. రూ. 864 ఉన్న ప్యాకెట్ ధరను రూ. 901గా నిర్ణయించింది. దీంతో రైతులపై ఒక్కో ప్యాకెట్‌పై రూ. 37 భారం పడనుంది. రాష్ట్రంలో ఈ వానకాలం సీజన్‌లో సుమారు 50 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతుందని వ్యవసాయశాఖ అంచనా వేస్తున్నది. ఎకరానికి 2 ప్యాకెట్ల చొప్పున మొత్తం కోటి ప్యాకెట్లు అవసరం అవుతాయి. ప్రభుత్వం 2.4 కోట్ల విత్తన ప్యాకెట్లను అందుబాటులో ఉంచింది. రైతులు 2 కోట్ల ప్యాకెట్లు కొనుగోలు చేస్తారని అంచనాలున్నాయి. దీంతో రైతులపై ఒక్కో ప్యాకెట్‌పై రూ. 37 చొప్పున.. 2 కోట్ల ప్యాకెట్లకుగానూ రూ. 74 కోట్ల భారం పడనుంది. కా గా, ఈ ఐదేండ్లలో కేంద్ర ప్రభుత్వం పత్తి విత్తన ప్యాకెట్ల ధరలను పెంచుతూ.. ఒక్క ప్యాకెట్‌పై రూ. 171 మేర రైతులపై కేంద్రం భారం మోపింది.

### ఆకేరు వాగు చెలిమలతో సాగు



సాగు నీరందక పంటలు ఎండిపోతుండటంతో రైతులు నానా తిప్పలు పడుతున్నారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఉల్లేపల్లి, బిచురాజ్‌పల్లి, పురుషోత్తమాయగూడెం, తండాధర్మారం, బాల్నీ ధర్మారం గ్రామాల నుంచి వెళ్లే ఆకేరు వాగు ప్రస్తుతం ఎండిపోయింది. గతంలో ఈ వాగు ఆధారంగా సాగునీరు వినియోగించేవారు. నిరుడు అతివృష్టితో వరదలొచ్చి ఆకేరు వాగుపై నిర్మించిన చెక్‌డ్యాంలు ధ్వంసమయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వాటికి మరమ్మతులు చేపట్టకపోవడంతో నీరు నిల్వ లేకుండా పోయింది. ఈ క్రమంలో ఆకేరు వాగులో రైతులు నీటి గుంతలు తీసి పంపుల ద్వారా పంటలను కాపాడుకోవడానికి శ్రమిస్తున్నారు. – మరిపెడ, మార్చి

### పండుగపూట మంచినీళ్ల కోసం నిరసన



మంచి నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గుండారంలోని పోచమ్మ తండా వాసులు ఆదివారం నిరసనకు దిగారు. ప్రభుత్వం ఇటీవల ఈ గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. తండాలో సుమారు 16 ఇండ్లకు 15 రోజులుగా తాగునీరు సరఫరా కావడం లేదు. అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. ఆదివారం ఉగాది పండుగ రోజు కూడా తాగునీరు సరఫరా కాకపోవడంతో కాలనీవాసులు గుండారం – సముద్రలింగాపూర్ ప్రధాన రహదారిపై డ్రమ్ములు, బకెట్లు, బిందెలు అడ్డంగాపెట్టి నిరసన తెలిపారు. గ్రామ కార్యదర్శి దేవరాజును వివరణ కోరగా, మిషన్ భగీరథ పైప్‌లైన్ మరమ్మతులు చేయిస్తున్నందున పోచమ్మతండాలో ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నట్టు తెలిపారు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని తండావాసులు డిమాండ్ చేశారు. – ఎల్లారెడ్డిపేట